సాక్షి ఖమ్మం
బుధవారం । 31 । జనవరి । 2024



సీపీఎస్ రద్దుకు కృషి

ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు వెల్లడించారు. 8లో



శ్రీమంతుడు.. శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యేల ఆస్తులు, విద్యార్హతలతో పాటు కేసుల వివరాలతో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ బాధ్యులు నివేదిక విడుదల చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగే అవకాశముంది. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

3న మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన ఫిబ్రవరి 3వ తేదీన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే జాబ్‌మేళాలో 65కి పైగా కంపెనీల బాధ్యులు పాల్గొంటారని తెలిపారు. సుమారు 5వేలకు పైగా నియామకాలు జరగనున్నందున 18నుండి 35ఏళ్ల వయస్సు కలిగి, పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు http://forms.hele/aWH1uo5 poS6 RrT3 D6 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు వివరాలకు 88867 11991, 96423 33668 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో డీవైఎస్‌ఓ తుంబూరు సునీల్‌రెడ్డి, జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరాం, ఏపీఆర్వో వల్లోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్‌లో 'కూరాకుల'పై అవిశ్వాసం కేసు తీర్పు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్, డీసీసీబీచైర్మన్ కూరాకుల నాగభూషణంపై అవిశ్వాస సమావేశానికి సంబంధించిన తీర్పును కోర్టు రిజర్వులో ఉంచింది. ఈనెల 27న సొసైటీలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించగా 11మంది డైరెక్టర్లు పాల్గొన్నారు. అప్పటికే చైర్మన్‌ను కోర్టును ఆశ్రయించగా అధికారులు సమావేశం నిర్వహించినప్పటికీ ఫలితాన్ని వెల్లడించలేదు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా డీసీఓ విజయకుమారి హాజరై సమావేశ వివరాలను నివేదిక రూపంలో అందజేశారు. ఇరువర్గాల వాదనలు విన్నాక తీర్పును కోర్టు రిజర్వ్ చేయడంతో ఫలితం అధికారికంగా వెల్లడి కాలేదు. కాగా, ఈ కేసు బుధవారం మళ్లీ విచారణకు రానుండగా తీర్పు వెలువడుతుందని భావిస్తున్నారు.

చేప పిల్లల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి



చేపపిల్లల ప్యాకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: చేప పిల్లల ఎంపికలో జాగ్రత్తలు పాటిస్తే మెరుగైన దిగుబడి వస్తుందని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ తెలిపారు. 'చేపల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు' అంశంపై మత్స్యకారులకు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈసందర్భంగా చేపపిల్లల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు.ఆతర్వాత మరో శాస్త్రవేత్త శాంతన్న చేపల మేత తయారీ వివరాలు వెల్లడించారు. ఈశిక్షణకు ఖమ్మం, సూర్యాపేట, వనపర్తి, మెదక్, నల్లగొండ, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులు హాజరుకాగా, శాస్త్రవేత్త రవీందర్, అశ్వారావుపేట డివిజన్ ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత ప్రాంతంలో పర్యటన



ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న జీఎం, తదితరులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత ప్రాంతమైన సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్‌నగర్‌ను కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెం రాజు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా కిష్టారంలోని ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీహాల్, గ్రంథాలయాన్ని పరిశీలించిన ఆయన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జీఎంను కాలనీ వాసులు కలిసి సమస్యలను విన్నవించారు. ఆర్‌ఓ ప్లాంట్ మంజూరు చేయాలని, ఓసీలు, సైలో బంకర్ నుంచి దుమ్ములేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కోటిరెడ్డి, ఎస్.వెంకటాచారి, ఎం.వీ.నర్సింహారావు, రమణారెడ్డి, సర్పంచ్ చెట్టుమాల రేణుకతో పాటు సునీత, అప్పారావు, పి.ఈశ్వర్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల జాతర!



మేడారానికి ఖమ్మం రీజియన్ నుంచి 530 బస్సులు

- రీజియన్‌లోని డిపోల నుంచి 130...
- ఇతర జిల్లాల నుంచి 400 బస్సుల కేటాయింపు
- 'మహాలక్ష్మి' రద్దీకి అనుగుణంగా ప్రణాళిక

ఖమ్మంమామిళ్లగూడెం: గిరిజన కుంభమేళాగా పేరున్న ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. జాతరకు భక్తులు సురక్షితంగా చేరుకునేలా ఖమ్మం రీజియన్ నుండి మేడారానికి ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ బస్సులు నడపాలని నిర్ణయించారు. మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో ఈసారి రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మునుపెన్నడూ లేని విధంగా ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 530 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఫిబ్రవరి 18నుంచి 25వ తేదీ వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.

530 బస్సుల కేటాయింపు

ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోలు ఉన్నాయి. అయితే, ఇల్లెందు డిపో పరిధిలో కూడా ఖమ్మం నుంచే బస్సులను మేడారానికి నడిపిస్తారు. మొత్తంగా రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 530 బస్సులు నడిపించాలని నిర్ణయించారు. ఇందులో రీజియన్‌లోని డిపోల నుంచి 130 బస్సులు కేటాయించగా.. ఇతర జిల్లాల నుంచి 400 బస్సులను ప్రత్యేకంగా తెప్పించనున్నారు. అయితే, డిపోల పరిధిలోని పాయింట్ల వారీగా మేడారానికి చార్జీల వివరాలు ఒకటి, రెండు రోజుల్లో వెల్లడించే అవకాశముంది.

రద్దీ ఆధారంగా బస్సులు పెంచుతాం



మేడారం జాతరకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈసారి గతంలో కన్నా బస్సుల సంఖ్య పెంచాం. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ ప్రకారం 530 బస్సులను మేడారానికి నడపాలని నిర్ణయించాం. అయితే, భక్తుల రద్దీ పెరిగితే బస్సుల సంఖ్య సైతం పెంచుతాం. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తల్లుల దర్శనానికి వెళ్లేలా సౌకర్యాలు కల్పించేలా డిపో మేనేజర్లు, ఉద్యోగులకు సూచనలు చేస్తున్నాం.

– సీహెచ్ వెంకన్న, రీజినల్ మేనేజర్, ఖమ్మం

మహాలక్ష్మి జన'జాతర'

ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా మేడారం జాతరకు సైతం గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు వెళ్లే అవకాశం ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తుండడంతో వారి కుటుంబ సభ్యులు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యాన రద్దీని తట్టుకునేందుకు బస్సుల సంఖ్య పెంచడమే మార్గమనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. సహజంగానే మేడారానికి భక్తులు ఎక్కువగా వెళ్తూ.. పలువురు ప్రైవేట్ వాహనాలను ఎంచుకునే వారు. కానీ ఈసారి ఉచిత ప్రయాణం నేపథ్యాన ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారనే ఆలోచనతో అధికారులు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేశారు.

డిపోలు, పాయింట్ల వారీగా బయలుదేరే బస్సుల సంఖ్య

డిపో	పాయింట్	బస్సుల సంఖ్య
ఖమ్మం	ఖమ్మం, ఇల్లెందు	167
కొత్తగూడెం	కొత్తగూడెం, టేకులపల్లి	167
భద్రాచలం	భద్రాచలం	62
మధిర	పాల్వంచ	42
మణుగూరు	మణుగూరు, మంగపేట	37
సత్తుపల్లి	వెంకటాపురం, ఏటూరునాగారం, చర్ల	55

పారదర్శకంగా ఓటరు జాబితా

జిల్లా పరిశీలకులు బాలమాయాదేవి



జాబితాను పరిశీలిస్తున్న బాలమాయాదేవి, పక్కన కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్

ఖమ్మం సహకారనగర్: ఓటర్ల జాబితాను వంద శాతం పారదర్శకంగా సిద్ధం చేయాలని జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు, హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి బి.బాలమాయాదేవి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆమె ఓటరు జాబితా రూపకల్పనపై ఆర్వోలు, ఏఆర్వోలతో సమీక్షించారు. ఈసందర్భంగా బాలమాయాదేవి మాట్లాడుతూ ప్రతీ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మెరుగైన జాబితా రూపకల్పన, ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేసిన యంత్రాంగాన్ని ఆమె అభినందించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించి వాటి వివరాలు వెల్లడించారు. ఈనెల 24వ తేదీ వరకు వచ్చిన 77,582 దరఖాస్తుల్లో 66,258 పరిష్కరించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే ప్రమాదాల నియంత్రణ



గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న కలెక్టర్, సీపీ తదితరులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూడళ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని, హైవేల నిర్మాణ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, సత్తుపల్లి, మధిర ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఉన్న వసతులపై పోలీస్, ఇతర శాఖలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు పోలీస్, రవాణా, వైద్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులు వెళ్లి వివరాలు సేకరిస్తే నివారణ చర్యలు సులువవుతాయని తెలిపారు. కేఎంసీ కమిషనర్ సురభి, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు కె.శ్యాంప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వర్లు, గౌస్ పాషా, హరికిషన్, గణేష్, బస్వారెడ్డి, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ గౌతమ్, సీపీ, అదనపు కలెక్టర్లు సహా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



గత ఏడాది ప్రాక్టికల్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

- జిల్లాలో 76 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 17,847 మంది విద్యార్థులు
- అరగంట ముందు ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు మొదలుకానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 131 ఉండగా... మొత్తం 17,847 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 13,194మంది, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం 4,653మంది చదువుతున్నారు. ఈమేరకు గురువారం నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను మూడు విడతలుగా నిర్వహించేందుకు 76 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం

పరీక్షలు పారదర్శకంగా జరిగేలా అర గంట ముందే ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. పరీక్ష కేంద్రంలో ఎగ్జామినర్ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా ప్రశ్నాపత్రాన్ని ప్రింట్ తీసే వెసలుబాటు లభిస్తుంది. కాగా, ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడుతలుగా పరీక్షలు జరగనున్నాయి.

తనిఖీలకు బృందాలు

జనరల్, ఒకేషనల్ విభాగాల విద్యార్థులకు మూడు స్పెల్స్‌గా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు హైపవర్ కమిటీని సైతం నియమించారు. ఒక్కో బృందంలో ఇద్దరు అధ్యాపకులు ఉంటారు. అలాగే, డీఈసీ కమిటీ సభ్యులుగా ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఒక లెక్చరర్ వ్యవహరించనున్నారు. ఇక ప్రైవేట్ కళాశాలల నుంచి ఆర్ట్స్ విభాగం అధ్యాపకులను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా నియమించారు.

సన్నద్ధత లేకుండానే...

జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు సంబంధించిన సామగ్రి పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. అలాగే, తరగతులు కూడా సక్రమంగా నిర్వహించలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ పరికరాలు, రసాయనాల కొరత నేపథ్యాన తూతూ మంత్రంగా తరగతులు నిర్వహించారని సమాచారం. ఈ నేపథ్యాన సరైన సన్నద్ధత లేకుండానే విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా... ఫలితాల విషయమై తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

హాల్‌టికెట్లు ఇవ్వకుంటే చర్యలు



ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడైనా ప్రైవేట్ కళాశాలలు యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టినట్లు సమాచారం తెలిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

కనుల పండువగా రామయ్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని జరిపించారు.

గందరగోళంగా సదరమ్ క్యాంపు



ఆస్పత్రి బయట వరకు వచ్చిన క్యూలైన్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపు గందరగోళంగా సాగింది. సరైన సకర్యాలు కల్పించకపోగా, క్యాంపు ఆలస్యంగా మొదలవడంతో దివ్యాంగులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వైరా నియోజకవర్గ స్థాయి క్యాంపు నిర్వహించగా, ఉదయం 9గంటల నుండే పెద్దసంఖ్యలో దివ్యాంగులు చేరుకున్నారు. అయితే, స్లాట్‌బుక్ చేసుకున్న రశీదుల ఆధారంగా దరఖాస్తు నింపే సమయాన గంటల తరబడి ఆలస్యమైంది. దివ్యాంగుల సంఖ్య ఆధారంగా సిబ్బందిని కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. అలాగే, గతంలో మాదిరి అల్పాహారంతో పాటు కుర్చీలు, టెంట్లు కూడా ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. కాగా, మంగళవారం నిర్వహించిన క్యాంపులో 77 మంది దివ్యాంగులు అర్హత సాధించారని అధికారులు తెలిపారు.

ప్రొటోకాల్‌పై రగడ

- అధికారుల తీరుపై జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ మండిపాటు
- సమావేశానికి గైర్హాజరైన వారికి నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు

ఖమ్మంవన్‌టౌన్: అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని.. ఇటీవల ఆరోగ్య ఉప కేంద్రాల ప్రారంభోత్సవ సమాచారం సైతం ఇవ్వలేదని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ శాఖల ద్వారా చేపట్టిన పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ విషయంలో చైర్మన్ అయిన తనను ఆహ్వానించకపోవడం సరికాదన్నారు. అలాగే, జిల్లా ప్రధానాస్పత్రి పరిస్థితి ఏమిటని ఆరా తీయగా... వైరా ఆస్పత్రిని వంద పడకలకు పెంచి హెడ్ క్వార్టర్ ఆస్పత్రిగా మారుస్తామని డీసీహెచ్‌ఎస్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇస్తామని చైర్మన్ తెలిపారు. అనంతరం కారేపల్లి జెడ్పీటీసీ వాంకుడోతు జగన్ జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరగా.. ఏపీడీ శిరీష అన్నిచోట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథపై సమీక్ష సందర్భంగా పెనుబల్లి జెడ్పీటీసీ చక్కిలాల మోహన్‌రావు మాట్లాడుతూ మొదట ఉన్నగ్రామాలకు నీరు అందుతున్నాయని పేర్కొనగా... అన్ని గ్రామాలకు నీరందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు బదులిచ్చారు. ఈ సమావేశాల్లో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో జిల్లాకు సాగర్ జలాలు

నేడు ఎడమ కాల్వకు విడుదల చేయనున్న అధికారులు



లకారానికి నీటి మళ్లింపు కోసం టేకులపల్లి వద్ద వేసిన అడ్డుకట్ట

ఖమ్మంఅర్బన్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమకాల్వకు బుధవారం నీరు విడుదల చేయనున్నారు. ఎడమకాల్వ ద్వారా నీరు చేరుకునే పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23అడుగులకు గాను 11.5 అడుగులకు పడిపోయింది. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు 125.60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్న నేపథ్యాన రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతోంది. దీంతో సాగర్ నుంచి తక్షణమే 1.5 టీఎంసీల నీరు విడుదల చేయాలని జిల్లా జలవనరులశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఈమేరకు మంగళవారం విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించినా... బుధవారానికి వాయిదా వేశారు. అక్కడ ఎడమకాల్వ ద్వారా విడుదల చేసే నీరు ఒకటి, రెండు రోజుల్లో పాలేరు రిజర్వాయర్‌కు చేరే అవకాశముంది. ఇక వైరా రిజర్వాయర్‌లోనూ 18అడుగులు పూర్తిస్థాయి నీటిమట్టానికి గాను 13 అడుగుల మేర నీరు ఉన్న నేపథ్యాన.. పాలేరు రిజర్వాయర్‌ను నింపాక అక్కడకు వదలనున్నారు. అంతేకాకుండా ఖమ్మంలోని లకారం మినీ వాటర్ ట్యాంక్‌ను సైతం నింపడానికి ప్రధాన కాల్వకు టేకులపల్లి వద్ద ఇప్పటికే అధికారులు ఆనకట్ట వేశారు.

ఎన్‌ఎస్‌ఎస్‌పై ఆసక్తి పెంపొందించాలి

కేయూ ప్రొఫెసర్ ఈ.నారాయణ



మాట్లాడుతున్న కేయూ కోఆర్డినేటర్ నారాయణ

ఖమ్మంస్పోర్ట్స్: విద్యార్థుల్లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)పై ఆసక్తి పెంపొందించాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈ.నారాయణ సూచించారు. ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎన్ఎస్ఎస్ పీఓల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సంఖ్య పెంచి రెండేసి యూనిట్లు ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో రుగ్మతలను రూపుమాపేందుకు వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో పరుగు పందెం పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా అథ్లెట్లకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఎన్.శ్రీనివాసరావు, ఆనంద్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పీఓలు వంశీప్రియ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన టీపీటీఎఫ్ నాయకులు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో వచ్చేనెల 11, 12వ తేదీల్లో జరగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలకు హాజరుకావాలని సీఎం రేవంత్‌రెడ్డిని నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.

ఫైనల్స్‌కు చేరిన ఖమ్మం అర్బన్, వీ.ఎం.బంజర జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ ఫైనల్స్ దశకు చేరింది. ఈమేరకు మంగళవారం జరిగిన సెమీస్‌లో ఖమ్మం అర్బన్, వీ.ఎంబంజర జట్లు విజేతలుగా నిలిచి ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. తొలి సెమీస్‌లో సత్తుపల్లిపై ఖమ్మం అర్బన్, రెండో సెమీస్‌లో తల్లాడపై వీ.ఎం.బంజర జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లను నాయకులు మానుకొండ రాధాకిషోర్, వడ్డెబోయిన నర్సింహారావు, దొడ్డ అశోక్, తాళ్లూరి హన్మంతరావు ప్రారంభించారు.

గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ వచ్చేనెల 16న నిర్వహించే గ్రామీణ బంద్, దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.విక్రమ్‌తో పాటు నాయకులు విష్ణు, పి.రమ్య, జె.ఉపేందర్, బోడపట్ల సుదర్శన్, నర్రా రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడి విచారణ

ఖమ్మం క్రైం: మూడు రోజుల క్రితం బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా కోర్టు అనుమతితో మంగళవారం విచారించారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటనలో నాగరాజు, ఆయన భార్య కార్పొరేటర్ శ్రీవిద్యపై కేసులు నమోదయ్యాయి. ఈమేరకు రిమాండ్‌లో ఉన్న నాగరాజు విచారణ కోసం కస్టడీ కోరగా కోర్టు ఒక రోజుకు అనుమతించింది. దీంతో ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని ఆస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం స్టేషన్‌లో న్యాయవాదుల సమక్షాన విచారణ చేపట్టారు.

సర్పంచ్‌తో పాటు ఐదుగురి రిమాండ్

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం సర్పంచ్ జక్కుల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రజిత భర్త రామన్నతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల సమయాన గ్రామంలో జరిగిన ఘర్షణలో మారేపల్లి ఉపేందర్‌రెడ్డి తనపై సర్పంచ్, ఉప సర్పంచ్ భర్తతో పాటు మరికొందరు దాడి చేసి గాయపర్చారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విచారణ చేపట్టి సర్పంచ్, ఉప సర్పంచ్ భర్త సహా ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన నీలం కొండమ్మను వేధిస్తున్న ఆమె అత్త, ఆడపడుచులు, ఆడపడచు భర్తపై మంగళవారం కేసు నమోదైంది. ఇంటి విషయంలో కొండమ్మను ఆమె అత్త సీతమ్మ, ఆడపడచులు రంగమ్మ, వరమ్మ, నాగమ్మ లతో పాటు ఆడపడచు భర్త సీతారాములు కొన్నాళ్లుగా వేధిస్తున్నారు. దీంతో కొండమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

రూ.46లక్షలకు పాన్‌షాప్ యజమాని ఐపీ

ఖమ్మం లీగల్: ఖమ్మం పార్శీబంధంకు చెందిన పాన్‌షాప్ యజమాని మహ్మద్ రిజ్వాన్ రూ.రూ.46.70లక్షలకు ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేయగా, అవి తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ 22మందిని ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

వైద్యం కోసం వెళ్తూ మృతి

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన మోతరపు మధుసూదన్‌రావు(53) ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో వైద్యం కోసం ఆయన మంగళవారం రైలు లో బయలుదేరాడు. అయితే, ఏపీలోని పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో తాగునీటి కోసం దిగి తిరిగే ఎక్కే క్రమంలో కాలుజారింది. దీంతో రైలు కిందపడిన మధుసూదన్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు.



శ్రీమంతుడు.. శ్రీనివాసరెడ్డి!

అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెలువడి దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఈనేపథ్యాన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ బాధ్యులు తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన ఎమ్మెల్యేల వివరాలతో నివేదిక విడుదల చేశారు. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా విడుదల చేసిన ఈ నివేదికలో ఎమ్మెల్యేల ఆస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర వివరాలు పొందుపర్చారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల వివరాలను పరిశీలిస్తే... ఆస్తుల్లో పాలేరు నుంచి ఎన్నికైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి అగ్రభాగాన నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా స్థితిమంతులైన ఎమ్మెల్యేల జాబితాల ఆయన రెండో స్థానంలో ఉండడం విశేషం. – సాక్షి, ఖమ్మం డెస్క్

ఆస్తుల్లో పొంగులేటికి టాప్ ర్యాంక్

- రాష్ట్రస్థాయి జాబితాలో రెండో స్థానం
- విద్యార్హతల్లో అగ్రభాగాన 'తెల్లం'
- పొంగులేటి, తుమ్మల, ఆదినారాయణపై కేసులు నిల్
- నివేదిక విడుదల చేసిన 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్'

ఎంఎస్.. ఎంబీబీఎస్

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేల్లో ఇద్దరు మినహా అందరూ డిగ్రీ, ఆపై విద్యార్హత కలిగి ఉన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎంఎస్(ఆర్థో), సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఎంబీబీఎస్ పూర్తిచేయగా, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఎంఏ, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎమ్మెస్సీ చదివారు. ఇక పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లుకు డిగ్రీ వరకు విద్యార్హత ఉండగా.. కోరం కనకయ్య ప్రాథమిక విద్య పూర్తిచేసినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కేసులు తక్కువే..

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతీ అభ్యర్థి తమపై నమోదైన కేసుల వివరాలు అఫిడవిట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా నుంచి ఎన్నికైన వారిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జారె ఆదినారాయణపై ఒక్క కేసు కూడా లేకపోవడం విశేషం. ఇక కూనంనేని సాంబశివరావు, భట్టి విక్రమార్క, రాందాస్ నాయక్‌పై మూడు చొప్పున, తెల్లం వెంకట్రావుపై రెండు కేసులు ఉన్నాయని వెల్లడించారు. అలాగే, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయిపై ఒక్కో కేసు మాత్రమే ఉన్నాయి.

రూ.100 కోట్లు.. ఆపై ఆరుగురు

రాష్ట్రవ్యాప్తంగా 119 మంది ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం కుటుంబీకులతో కలిపి రూ.100కోట్లు ఆపైన ఆస్తులు కలిగిన వారు ఆరుగురు ఉన్నారు. ఈ జాబితాలో రూ.606.67కోట్ల ఆస్తులతో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మొదటి స్థానంలో నిలవగా రూ.461.05 కోట్ల ఆస్తులతో పొంగులేటి రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత స్థానాలు వరుసగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి(మునుగోడు), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి(భువనగిరి), గడ్డం వినోద్(బెల్లంపల్లి), కొత్త ప్రభాకర్‌రెడ్డి(దుబ్బాక) నిలవగా.. మిగతా వారికి రూ.100కోట్ల లోపు ఆస్తులే ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపర్చారు. ఇక మన జిల్లా ఎమ్మెల్యేల విషయానికొస్తే.. తుమ్మల నాగేశ్వరరావు(ఖమ్మం) రూ.17.88కోట్లు, మల్లు భట్టి విక్రమార్క(మధిర) రూ.8.13కోట్లు, పాయం వెంకటేశ్వర్లు(పినపాక) రూ.7.01కోట్లు, మాలోతు రాందాస్‌నాయక్(వైరా) రూ.3.38కోట్లు, కోరం కనకయ్య(ఇల్లెందు) రూ.2.78 కోట్లు, కూనంనేని సాంబశివరావు(కొత్తగూడెం) రూ.2.33కోట్లు, మట్టా రాగమయి(సత్తుపల్లి) రూ.1.92కోట్లు, తెల్లం వెంకట్రావు(భద్రాచలం) రూ.1.45కోట్లు, జారె ఆదినారాయణ(అశ్వారావుపేట) రూ.57లక్షల మేర ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన ఆర్టీసీ కండక్టర్



కండక్టర్ విజయను అభినందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ఇటీవల ప్రభుత్వం స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారి జాబితా విడుదల చేసింది. ఈమేరకు స్టాఫ్‌నర్స్‌గా ఎంపికైన సత్తుపల్లి ఆర్టీసీ డిపో కండక్టర్ గుండపనేని విజయ ఎంపిక మంగళవారం ఆమెను డీఎం యు.రాజ్యలక్ష్మి అభినందించారు. కల్లూరు మండలం పేరువంచకు చెందిన విజయ జీఎన్ఎం పూర్తి చేశాక 2009 నుంచి కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈమేరకు స్టాఫ్‌నర్స్ ఫలితాల్లో జోనల్‌స్థాయిలో 132వ ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపికైంది. అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.



రత్నకుమారి

రాష్ట్రస్థాయిలో 67వ ర్యాంక్

బోనకల్: ప్రభుత్వం రెండురోజుల క్రితం ప్రకటించిన స్టాఫ్‌నర్స్ ఫలితాల్లో మండలంలోని చొప్పకట్లపాలెంకు చెందిన కొనకంచి రత్నకుమారి రాష్ట్రస్థాయిలో 67వ ర్యాంక్ సాధించింది. అలాగే, భద్రాద్రి జోన్ పరిధిలో మొదటి స్థానంలో నిలవగాఆమెను పలువురు అభినందించారు.

సీపీఎస్ రద్దుకు కృషి చేస్తాం

ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదులు

చింతకాని: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దుకు కృషి చేస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు వెల్లడించారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకునేందుకు చింతకాని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎస్టీఎఫ్ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు. అలాగే, 317 జీఓను సమీక్షించాలని, బదిలీలు, పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్ సమస్య పరిష్కరించాలని, పండిట్లను అప్‌గ్రేడేషన్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఎరియర్స్ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎస్టీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కంచుమర్తి పుల్లయ్య, కరీముల్లా, పాశం శ్రీనివాస్, సత్యనారాయణ, మహబూబ్ అలీ, కోటారెడ్డి, వెంకన్న, దుప్పటి రవికుమార్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల డిప్యూటేషన్లకు సహకరించాలి

ఖమ్మంరూరల్/ముదిగొండ: ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు సహకరించాలని తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల వీరస్వామి కోరారు. ఖమ్మం మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాల, ముదిగొండ మండలం ఎమ్మార్సీలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఖాళీలను నింపాలన్నారు. ఈసమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగ్గినేని నాగేశ్వరరావుతోపాటు ఎన్‌వీకే.ప్రసాద్, ప్రభాకర్, ఖాదర్, సుబ్బారావు, నాగేశ్వరరావు, శాంతి, పద్మావతి, బాలస్వామి, వినయ్‌కుమార్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

13 కేజీల గంజాయి స్వాధీనం

వైరా/కొణిజర్ల: ఒడిశా నుంచి తరలిస్తున్న ఎండు గంజాయిని కొణిజర్ల శివారులో మంగళవారం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రమ్యారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల శివార్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఆకాశ్‌సింగ్, రూపేశ్‌సింగ్‌గా తేలగా... ఒడిషా నుంచి ఎండు గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి రూ.3లక్షల విలువైన 13 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఉద్యోగులు కిరీటి, మమత, బాల్య, రవి, సీతారాం, శ్రావణ్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు. కాగా, నిందితులను కొణిజర్ల సమీపాన అదుపులోకి తీసుకున్నామని చెప్పిన ఎక్సైజ్ అధికారులు ఏ వాహనంలో వెళ్తున్నారో వెల్లడించకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచడంలో అంతరార్థమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పాల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

కొణిజర్ల: పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంతో రోడ్డు దాటుతున్న వ్యక్తిని వెనక నుంచి పాలవ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంకు చెందిన చంద్ర సత్యనారాయణ(50) అలియాస్ బుల్లయ్య కొణిజర్ల మండలం తనికెళ్లకు వచ్చి తిరిగి వెళ్తూ నుంచి బ్రౌన్స్ కళాశాల ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్‌లోకి వస్తున్నాడు. ఈక్రమంలోనే వైరా వైపు నుంచి వస్తున్న పాలవ్యాన్ వెనక నుంచి ఢీకొట్టగా తీవ్ర గాయాలతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ జె.శంకరరావు తెలిపారు.

చిరుమర్రిలో ఒకరు...

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పమ్మి గ్రామానికి చెందిన బాపట్ల వీరబాబు(28) ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి చిరుమర్రి మీదుగా పమ్మి వెళ్తున్నాడు. ఈక్రమంలో జరిగిన ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడగా ఖమ్మం ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే, వీరబాబు వాహనాన్ని వెనక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టిందా, ట్రాక్టర్‌నే ఆయన ఢీకొట్టాడా అనేది తెలియాల్సి ఉంది. కాగా, ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేష్ తెలిపారు.

భవనం పైనుండి పడి సుతారి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంపై పనులు చేస్తున్న సుతారి కనకం వీరబాబు(30) ప్రమాదవశాత్తు జారిపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన వీరబాబు ఐదు రోజులుగా కవిరాజ్‌నగర్‌లో ఇంటి నిర్మాణ పనులకు వస్తున్నాడు. ఈమేరకు శ్లాబ్ వేసేందుకు మంగళవారం ఉదయం ముందస్తు పని చేస్తుండగా జారి కింద పడ్డాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా వైద్యం అందించే క్రమంలోనే మృతి చెందడంతో వీరబాబు భార్య మణీంద్ర ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చెరుకు రైతుల ఆందోళన

కల్లూరు రూరల్: సకాలంలో చెరుకు కటింగ్ చేసి ఫ్యాక్టరీకి తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లక్ష్మీపురంలో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా రైతులు మందపాటి మాధవరెడ్డి, వలసాల మురళి, వెంకటేశ్వరరావువ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో 70 ఎకరాల్లో సాగుచేసిన చెరుకును సకాలంలో కటింగ్ చేయకపోవడంతో పంట ఎండిపోయి తాము నష్టపోతున్నామని వాపోయారు. ఇప్పటికే స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిపివేసినందున ఏపీలోని ఉయ్యూరు ఫ్యాక్టరీకి తరలించాల్సి వస్తోందని తెలిపారు. ఈమేరకు తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంకు చెందిన ఫొటోగ్రాఫర్ వరికొప్పుల గోపి ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా, ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.1.85 లక్షలను అందించగా.. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మాట్లాడారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేములూరి నాగరాజు దేవర, మర్రెల నాగేశ్వరరావుతో పాటు శ్రీనివాసరావు, సత్యనారాయణ, వీరన్న, శ్రీకాంత్, ఆంజనేయులు, కొత్తకొండ వెంకటేశ్వరరావు, అచ్చిబాబు, ఆదాం, కొమ్మూరి నరేష్, వల్లాల ఉపేందర్, రామగిరి రవి, మౌలానా, సుబ్బారావు, కిరణ్‌కుమార్, పి. రామకృష్ణ, జానీ, హుస్సేన్, చారి పాల్గొన్నారు.

రైతులపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: కొణిజర్ల మండలంలోని రైతులపై నమోదైన కేసును కొట్టివేస్తూ ఖమ్మం ప్రొహిబిషన్, ఎక్సైజ్ న్యాయమూర్తి ఆర్.శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. 2019 జనవరి లో కొణిజర్ల మండలంలోని రైతులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నే ఉదయ్‌ప్రతాప్, నాయకులు బండారు నరేష్, కొల్లి సుధాకర్ ఆధ్వర్యాన నీరు లేక పంటలు ఎండిపోతున్నందున కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలంటూ ధర్నా చేపట్టారు. దీంతో అప్పుడు 30 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కేసు పూర్వపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కాగా, నిందితుల తరపున ఎస్.వెంకటేశ్వర గుప్తా వాదించారు.

హైదరాబాద్‌లో బచ్చోడు వాసి హత్య

- పెట్రోల్ పోసి తగలబెట్టిన దుండగులు



నర్సయ్య (ఫైల్)

తిరుమలయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన నందిపాటి నరసయ్య(60) హైదరాబాద్‌లో సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సయ్య కుటుంబజీవనం కోసం హైదరాబాద్ వలసవెళ్లి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే సోమవారం రాత్రి బయటకు వెళ్లిన ఆయన చెట్లపొదల మధ్య శవమై కనిపించాడు. గుర్తుతెలియని వ్యక్తులు నర్సయ్యపై పెట్రోల్‌పోసి తగులబెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఆయనకు భార్యతో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, బ్రతుకుదెరువు కోసం వెళ్లిన వ్యక్తి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మధిరరూరల్: మధిర– తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నాడు. అప్‌లైన్‌లో వెళ్తున్న రైలు కింద పడి ఆయన ఆత్మహత్య చేసుకోగా, మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 99636 41484 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

కారుడ్రైవర్ ఆత్మహత్య..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని శ్రీరాంనగర్ రోడ్డు నంబర్–10లో ఉండే కార్‌డ్రైవర్ జి.రాకేష్(20) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన పనికి వెళ్లడం లేదు. ఖర్చుల కోసం డబ్బులు అడగగా కుటుంబీకులు ఇవ్వకపోవడంతో ఆయన ఆత్మహత్యకు చేసుకున్నాడని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం చర్చి సమీపాన సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం భద్యాతండాకు చెందిన నేనావత్ హుస్సేన్ మిర్చి బస్తాలను జటంగి అంజయ్య ఆటోలో తీసుకుని ఖమ్మం మార్కెట్‌కు వస్తున్నాడు. అయితే, మాదిరిపురం వద్ద ఆటో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపారు. ఈక్రమంలో వెనక నుండి వచ్చిన లారీ ఢీకొట్టగా హుస్సేన్ కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

మధిరరూరల్: మేత కోసం వెళ్లిన పాడిగేదె విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మధిర యాదవ బజార్‌కు చెందిన రైతు బాజినీటడి రామకృష్ణ తన గేదెను మేత కోసం పొలానికి మంగళవారం తీసుకెళ్లాడు. ఇల్లందులపాడు సమీపాన పొలాల్లో మేస్తుండగా నేలపై పడి ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.80వేలు విలువైన గేదె మృతి చెందినందున తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఏడో గ్యారంటీగా విద్యాకమిషన్ ఏర్పాటు చేయాలి



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీగా విద్యా కమిషన్‌ను ఏర్పాటుచేసి విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల అధ్యక్షుడు బండారు నాగరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యాన బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి.. శాస్త్రీయ, లౌకిక విలువలతో కూడిన విద్యావిధానం రూపొందించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక పాత పింఛన్ విధానం పునరుద్ధరణ, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు, హెల్త్ కార్డులు మంజూరు చేసి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసరావు, రత్నమ్మ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో బండారుపల్లి రాజారావు, నాగేశ్వరరావు, రంజాన్, సురేష్, నాగూర్‌వలీ, అజయ్‌కుమార్, ఆంజనేయులు, మీరాఖాన్, లక్ష్మణరావు, సాంబయ్య, రామకృష్ణ, వినోదరావు తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరిధిలో క్రీడాభివృద్ధికి కృషి



వెంకయ్యను పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులను క్రీడారంగంలో తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. ఖమ్మంలోని కవిత మెమోరియల్ కళాశాలకు మంగళవారం ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థులు రాణించేలా అన్ని విధాల పర్యవేక్షిస్తామని తెలిపారు. కాగా, వెంకయ్యకు తొలుత కేయూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం కార్యదర్శి బి.వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు, పీడీ జె.ఉపేందర్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం...

ఖమ్మం వైద్యవిభాగం: కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మించేలా అందరూ కృషి చేయాలని వైద్యవిద్యార్థులు పిలుపునిచ్చారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు వ్యాధిని నిర్మూలించాలని అవగాహన కల్పిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై అపోహలు విడనాడి, నిర్మూలకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ అమర్‌సింగ్, రాంబాబు, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.